

అమృత్ పథకంలో నరసరావుపేటలో నిర్మించిన వాటర్ ట్యాంక్

అమృత్.. అంతేనా

టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం

- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు
- మునిసిపల్ పరిపాలనా విభాగంలో కదలని దస్త్రం
- పెరిగిన వ్యయం రూ 43.70 కోట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం అమలు అడుగు ముందుకు పడటలేదు. పురాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం కాక పౌరులు ఇక్కట్లు పడుతున్నా అమృత్ పనులు ఇప్పట్లో చేపట్టే పరిస్థితులు లేవు. రాష్ట్రంలోనే తొలి సారిగా అమృత్ పథకం 2.0 కింద చేపట్టే ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. ఇప్పటి వరకు జాతీయ రహదారుల నిర్మాణంలో విని యోగించిన పీపీపీని, మునిసిపాలిటీల్లో చేపట్టే ప్రగతి పనులకుఅమలు చేస్తోంది.

50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తోంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహించాలి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అమృత్ 2.0 పథకం పనులను ఒకే ప్యాకేజి కింద టెండర్ నిర్వహిస్తున్నారు. పనులకు సబంధించిన టెండర్ నిర్వహణ వాయిదాల పర్వంగా మారింది. ఇప్పటికే రెండు సార్లు టెండర్ వాయిదా వేసిన విషయం తెలిసిందే. ముచ్చటగా మూడోసారి టెండర్ పిలిచేందుకు అధికారులు సమాయత్తమైనా ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడంలేదు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాలిటీల్లో రూ. 1092.40 కోట్ల వ్యయంతో పీపీపీ తరహా విధానంలో ప్రజారోగ్యం,మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ప్రగతి పనుల టెండర్‌ను పిలిచినా రెండు సార్లు వాయిదా పడింది. ప్రామాణిక రేట్లు పెరగడంతో పనుల వ్యయం రూ 1,136 కోట్లకు పెరిగింది.

20న మాచర్లలో
స్వచ్ఛాంధ్ర

- హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- జేసీతో కలిసి ఎమ్మెల్యే జూలకంటి స్థల పరిశీలన

మాచర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడో ఒక దగ్గర ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20న శనివారం మాచర్ల పట్టణంలో జరిగే స్వచ్ఛాంధ్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. దీంతో పట్టణంలో స్వచ్ఛాంధ్ర నిర్వహించేందుకు మంగళ వారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, గొర్రెలమండి, దేవాళమ్మ చెరువు, టిడ్కో గృహ సముదాయాలు, గిరిజన ఆశ్రమ పాఠశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ సూరజ్ గనోరే, డ్వామా పీడీ లింగమూర్తి, డీపీవో ఎస్‌వీ నాగేశ్వరనాయక్, మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, వైస్ ఛైర్ పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ సిద్ధయ్య యాదవ్, కమిషనర్ దూళిపాళ్ల వేణుబాబు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఎంఈవో అల్లి సురేష్, సర్వేయర్ సాల్మన్‌రాజులతో పాటు కలివెల జ్యోతి కిషోర్, వజ్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహాల వద్ద స్థల పరిశీలనలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



వృద్ధి రేటు 15 శాతం
పెరగాలి

- 3 నెలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి
- జిల్లాలో మైనింగ్ ఆదాయం పెరగాలని ఆదేశం
- నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- ముగింపు సదస్సులో కలెక్టర్, ఎస్పీలతో సీఎం చంద్రబాబు

నరసరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వృద్ధి రేటు ఇంకా 15 శాతం పెరగాలని సీఎం చంద్రబాబు తెలిపారు. రాజధాని అమరావతి వెలగపూడి సచివాలయంలో రెండు రోజులు జరిగిన కలెక్టర్ల సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్, ఎస్పీలకు సీఎం మార్గనిర్దేశం చేశారు. గ్రోత్‌రేట్‌కు సంబంధించి కొన్ని విభాగాల్లో జిల్లా కొంత మెరుగైన స్థానంలో ఉందని, మిగిలిన శాఖల్లో కూడా రాబోయే మూడు నెలల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. మైనింగ్ ఆదాయం పెరగాలని ఆదేశించారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్నారు. ఉపాధితో సమాజంలో సంతృప్తి స్థాయిలు పెరుగుతాయన్నారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రీన్‌ఎనర్జీతో ముందుకు వెళ్లాలని తెలిపారు. జిల్లాలోని పరిస్థితులకు అనుగుణంగా యాక్షన్‌ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన సమన్వయంతో బ్యాలెన్స్ చేసుకుని ముందుకు సాగాలని కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలు రావాలంటే నేరాలు అదుపులో ఉండాలన్నారు. ఈ మేరకు క్రైమ్ రేటును 33 శాతం తగ్గించాలని ఎస్పీని ఆదేశించారు. నేరాల అదుపునకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లాలో సంక్షేమం, ప్రగతికి సంబంధించిన నివేదికలను కలెక్టర్ కృతికాశుక్లా, శాంతిభద్రలకు సంబంధించిన నివేదికను ఎస్పీ కృష్ణారావు సదస్సులో అందజేశారు.



వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

సీఎం పర్యటనకు
విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు, (వెలగపూడి) సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ నియామక పత్రాలు అందజేయనున్న ప్రాంగణంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 19వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర ఎన్-9 రోడ్డు వద్ద డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమం జరుగనుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సంబంధిత ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలిలతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌లను, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తుళ్లూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ మురళీకృష్ణ, జిల్లావిద్యాశాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో కమిషనర్ జస్వంత్, మునిసిపల్ అధికారులు

పన్ను సర్వేకు ప్రత్యేక బృందాలు

నరసరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను సర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు నరసరావుపేట మునిసిపల్ కమీషనర్ ఎం జస్వంత్‌రావు తెలిపారు. మునిసిపల్ బంగళాలో సర్వే బృందాలతో మంగళవారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ ఆస్తి పన్ను, నీటి చార్జీల బకాయిలు వసూలు, కొత్తగా నిర్మాణం జరిగిన భవనములు, పాత భవనములకు అదనముగా నిర్మించిన కట్టడములను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆస్తి, నీటి పన్ను నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. కొత్తగా నిర్మాణాలను గుర్తించి పన్ను విధించాలని సూచించారు. పట్టణ ప్రజలు సర్వేకు సహకరించి, పన్నుల బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ జి.రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ మహ్మద్ రఫీక్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్యోతి, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బెయిలీబాబు, సయ్యద్ జహంగిర్ పాల్గొన్నారు.

డాక్టర్ కోడెల ఓ సమూహాశక్తి

- కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండ
- మాజీ స్పీకర్ విగ్రహావిష్కరణలో ప్రభుత్వ సలహాదారు షరీఫ్

వినుకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కోడెల వ్యక్తి కాదని, ఆయన ఒక సమూహాశక్తి అని ప్రభుత్వ సలహాదారు ఎండీ షరీఫ్ తెలిపారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలనీలో మంగళవారం మాజీ శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ కాంస్య విగ్రహావిష్కరణ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో షరీఫ్ మాట్లాడుతూ 1983 నుంచి కోడెలతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన ఆలోచనలు ముందుకు తీసుకుపోవాలని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకు నడవాలన్నారు. కష్టపడి పనిచేసిన వారికి టీడీపీ పెద్దపీట వేస్తుందన్నారు. పునాదుల నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లోనూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. జగన్ అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని 15-20 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లారన్నారు. అందరూ బాగుండాలి, అందులో మనం ఉండాలని కోరుకుంటే రాష్ట్రం అగ్రగామిగా నిలిస్తుందన్నారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ మాట్లాడుతూ కోడెల అంటే ఒక బ్రాండ్ అని, తాను గుంటూరులో చదువుకునే రోజుల్లోనే ఆయన గురించి విన్నానని, ఆత్మగౌరవం కోసం బలిదానం చేసిన వ్యక్తి కోడెల అన్నారు. కోటప్పకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేశారని కోడెల అంటే కోటప్పకొండ, కోటప్పకొండ అంటే కోడెల అని నేటికీ చెప్పుకుంటున్నారంటే అది ఆయన గొప్పతనమన్నారు.





డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు ఎండీ షరీఫ్, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కోడెల శివరాం, కొమ్మాలపాటి, మక్కెన, అనంతరం సభలో ప్రసంగిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

కొండపై అసంపూర్తిగా నిలిచిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం



8లో..

దేవుళ్లకు నైవేద్యాలు

- నిత్యకైంకర్యాలకు నోచుకోని వైనం
- ఆక్రమణల్లో ఆలయాల భూములు

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

రంగా వర్సిటీలో పీజీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

21 పోస్టులతో 5 ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

ఏపీ ఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పు

6లో..

బార్లు కిటకిట

- బార్లు తగినా వ్యాపారం పెరిగింది
- గతంలో ఉన్నన్ని లేకపోవడంతో రద్దీగా బార్లు
- గత నెలలో 99 బార్లలో రూ.6.62 కోట్ల అమ్మకాలు
- ఈ నెలలో 53 బార్లలో రూ.8.74 కోట్ల విక్రయాలు



గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బార్లు కిటకిటలాడుతున్నాయి. ఒకవైపు నష్టం వస్తుందని బార్ల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. అయితే ఉన్న బార్లలో వ్యాపారం జోరందుకుంది. గత నెల ఉన్న బార్ల సంఖ్యకు ఈ నెలలో అందుబాటులో ఉన్న బార్ల సంఖ్యతో చూస్తే సగానికి సగం తగ్గాయి. అయినా వ్యాపారం మాత్రం భారీగా పెరిగింది. కూటమి ప్రభుత్వ మద్యం పాలసీ మార్చింది. ఈ క్రమంలో బార్లకు గడువు ముగియడంతో గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే బార్ అండ్ రెస్టారెంట్లు సక్రమంగా సాగవని, నష్టం వస్తుందని వ్యాపారులు దరఖాస్తులకు ముందుకు రాలేదు. గత నెలలో నోటిఫికేషన్ రెండు సార్లు గడువు పెంచింది. ఈ నెలలో రీ నోటిఫికేషన్ జారీ చేసి మళ్లీ రెండు సార్లు గడువు పెంచింది. అయినా వ్యాపారులు బార్ల నిర్వహణకు ముందుకు రాలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో ఎక్సైజ్ అధికారులు ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులతో పాటు ప్రభుత్వ వర్గాలు, మద్యం వ్యాపారులను ఆశ్చర్యపరిచేలా బార్ల వ్యాపారం జోరందుకుంది. గుంటూరుతో పాటు, పల్నాడు జిల్లాలో బార్ల సంఖ్య చాలావరకు తగ్గినా వ్యాపారం ఏ మాత్రం తగ్గకపోగా పెరిగింది. గత నెలలో పాత బార్లు ఉన్నప్పుడు మొదటి రెండు వారాల్లో జరిగిన వ్యాపారంతో పోలిస్తే కొత్త లైసెన్స్ విధానం వచ్చాక నూతన బార్లు ప్రారంభించిన రెండువారాల్లో అమ్మకాలను బేరీజు వేయగా మద్యం అమ్మకాలు తగ్గాల్సిందిపోయి భారీగా పెరిగాయి. గుంటూరు జిల్లాలో గత నెల మొదటి 15 రోజుల్లో బార్లు 99 ఉండగా వాటి ద్వారా రూ.6.62 కోట్ల వ్యాపారం జరిగింది. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు 53 బార్లు మాత్రమే ఉండగా అందులో రూ.8.74 కోట్ల అమ్మకాలు జరిగాయి. వాస్తవానికి బార్ల సంఖ్య గత నెలలో కంటే ఈ నెలలో బాగా తగ్గాయి. వాస్తవానికి బార్ల సంఖ్య తగ్గితే అమ్మకాలు భారీగా తగ్గాలి. కానీ అమ్మకాలు జోరందుకున్నాయి.

దరఖాస్తులకు ఆసక్తి..

ఇంతకాలం బార్ల దరఖాస్తులకు ముందుకు రాని వ్యాపారులు ఈ నెలలో ఇప్పటి వరకు జరిగిన అమ్మకాలను చూసి మళ్లీ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గుంటూరు, పల్నాడు జిల్లాలలో తిరిగి మరికొన్ని బార్లకు దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు 67 బార్లు ఖాళీగా ఉండగా, పల్నాడు జిల్లాలో 49 బార్లకు 30 బార్లకు దరఖాస్తులు రాలేదు. రీ నోటిఫికేషన్ ప్రకారం ఆయా బార్లకు దరఖాస్తు చేసేందుకు బుధవారంతో ముగియనున్నది. ఈ క్రమంలో మంగళవారం వరకు చూస్తే 14 బార్లకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. పైగా మంగళవారం బార్లపై సమీక్షించిన ముఖ్యమంత్రి అవసరమైతే పాలసీ మార్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో మరింతమంది ముందుకు వచ్చే అవకాశం ఉండటంతో చివరి రోజైన బుధవారం భారీగా దరఖాస్తులు పడతాయని అధికారులు భావిస్తున్నారు.



అంధకారంలో ప్రకాష్‌నగర్ వైపు ఆర్‌యూబీ

అంధకారంలో.. ఆర్‌యూబీ

- జిల్లా కేంద్రంలో వెలగని వీధి దీపాలు
- కొనుగోలు చేయలేని స్థితిలో మున్సిపాలిటీ
- కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని వైనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణ వీధల్లో చీకటి రాజ్యమేలుతోంది. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ప్రకాష్‌నగర్ ఆర్‌యూబీని అంధకారం అలముకుంది. ప్రకాష్ నగర్‌లో రైల్వే ట్రాక్ పక్క రహదారి, అంధుల స్కూల్ పక్కన ఉన్న ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పల్నాడు రోడ్డులో డివైడర్‌లోని సెంట్రల్ లైటింగ్ లో కూడా లైట్లు వెలగడం లేదు. కొన్ని స్థంబాలు కూలిపోయి నెలలు గడుస్తున్నా వీటిని తిరిగి ఏర్పాటు చేయలేదు. ఎక్క డైనా వీధిలైట్లు వెలగడం ఆగితే వాటిని పునరుద్ధరించే పరిస్థితిలేదు. కాంట్రాక్టర్ల కు బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా, మునిసి పాల్టీలో వీధి దీపాల కొరత నెలకొందని సమాచారం. చీకటి వీధుల కారణంగా ప్రజల భద్రత ప్రమాదకరంగా మారింది. పాదచారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నడిచి వెళ్లాలంటే మహిళలు భయాందోళనలకు గురవుతున్నా చర్యలు తీసుకోవడంతో పుర పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



స్టేషన్ రోడ్డు వైపు ఆర్‌యూబీ

ఆదాయం పెంపునకు మార్గాలను అన్వేషించండి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ ఆఫ్ ట్రైనర్ శ్రీనివాస్ రెడ్డి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆదాయం పెంపునకు నూతన మార్గాలను అన్వేషించాలని మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు వచ్చే పన్నుతో పాటు ఇతర ఆదాయం మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని సూచించారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. మాస్టర్ ట్రైనర్స్ వేమూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగరాజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

బయట ఉపన్యాసాలు కాదు సభకు రండి జగన్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రజలచే ఎన్నుకోబడిన వారు, ప్రజాసమస్యలపై చట్టసభల్లో గళం విప్పాలి.. కానీ జగన్ సహా ఆయన పార్టీ ఎమ్మెల్యేలు సభలకు రాకుండా బయట ఉపన్యాసాలిస్తూ కాలం గడపడం ఎంతవరకు సబబు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 18 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ సభ్యులు హాజరై, రాష్ట్రంలోని సమస్యలపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. శాసనసభలో జగన్ లేవనెత్తే ఏ అంశంపైనయినా చర్చించడానికి, వాస్తవాలు తెలియచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత

● పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం



ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్త మానవాళికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు మొహమద్ నజీనా బేగం అన్నారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో ఐటీసీ, కాలుష్య నియంత్రణ మండలి, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నజీనా బేగం మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరగడంతో ఓజోన్ పొరకు ప్రమాదం ఏర్పడిం దన్నారు. దీంతో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతిం దన్నారు. రాబోతున్న విధ్వంసాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకం చేపట్టాలని పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కో ఆర్డినేటర్ డీ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఓజోన్ పొరపై దుష్ప్రభావం చూపై రసాయన సమ్మేళనాలన్నింటిని నియంత్రించి, విరివిగా మొక్కలను నాటాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఓజోన్ పొరపై డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ జ్యోత్స్నకుమారి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర జిల్లా సమన్వయ కర్త సంతోష కుమారి, ఐటీసీ ఎమ్ఎస్కే అండ్ ఫిన్‌ఫ్ సొసైటి ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణ, ఎన్జీవోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



14 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 588.30 అడుగులు ఉంది. ఇది 306.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7029 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967 క్యూసెక్కులు, 14 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,10,908 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,63,104 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,42,576 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 1,49,318 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టునుంచి పులిచింతలకు 1,49,318 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కెవెంకటరమణ,ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు చెప్పారు.ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 9 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 1,41,165 క్యూసెక్కులు,రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం 8153 మొత్తంగా 1,49,318 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.సోమవారం అర్ధరాత్రి 12గంటలవరకు 0.063 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 1,44,096 క్యూసెక్కుల నీరొస్తుండగా రిజర్వాయర్ 75.45 మీటర్లమేర నీ రుండగా ఈ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు.



టెయిల్‌పాండ్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పశ్చిమడెల్టాకు 4513 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 4513 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమ ట్టం ఉండగా దిగువకు 25,375 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాలసబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు నీటివిడుదల నిలిపివేశారు. రేపల్లెకాల్వకు 1196 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 376 క్యూసెక్కులనీరు,పశ్చిమకాల్వకు196క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 384 క్యూసెక్కులనీరు, కొమ్మ మూరు కాల్వకు 1818 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 44.08 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 87,314 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఐదు గేట్ల ద్వారా 1,20,548 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,37,548 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కోడెల ఆశయాలను నెరవేర్చాలి

● మెగా వైద్యశిబిరంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఆశయాలను నేరవేర్చాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని కోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సంద ర్భంగా ఆసుపత్రిలో కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ కామినేని ఆసుపత్రి, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె, నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 962 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో గుండె సమస్యలు ఉన్నవా రిని 36 మందిని, నేత్ర సమస్యలు ఉండి ఆపరేషన్ అవసరమైన వారిని 302 మందిని గుర్తించడం జరిగింది. కామినేని ఆసుపత్రి నుంచి డాక్టర్ భార్గవి, డాక్టర్ వై నవ్యనాథ్‌లు వైద్య సేవలు అంద జేశారు. శంకర నేత్రాలయం నుంచి డాక్టర్ రమ్య, సైదారావులు సేవ లు అందజేశారు. ముందుగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ ఉన్నంత కాలం ధైర్యాన్ని, గౌరవాన్ని ఇచ్చి అండగా నిలిచిన నాయకుడు కోడెల శివప్రసారావు అని కోడెల శివరామకృష్ణ అన్నారు. మిమ్మల్ని నేను కాపాడు కోవాలని, నన్ను నడిపించాలన్సిన బాధ్యత మీ అందరిమీద ఉందన్నారు. ఆయన కలలను నేరవేర్చినప్పుడే కోడెల రుణం తీర్చుకున్నవాళ్ళం అవుతామన్నారు, మా చిన్న వయస్సులోనే కలలో కూడా ఊహించనంత గౌరవాన్ని ఇచ్చిన కోడెల అభిమానులు మీరన్నారు. అనంతరం కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మాలపాటి ప్రభాకర్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బొడ్డపాటి పేరయ్య, ఏడుకొండలు, వసుందర, కదం నాగజ్యోతి, గట్టుపల్లి సత్యనారాయణ, కొలికొండ కొండలు, మందాడి రవి, కొక్కి రాల శ్రీనివాసరావు, కొల్లి ఆంజనేయులు, మహిళలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డాక్టర్ కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోడెల శివరామకృష్ణ తదితరులు

మోటార్ బైక్ దొంగల అరెస్టు

15 ద్విచక్రవాహనాలు స్వాధీనం

ఈపూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 15 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం హనుమంతురావు తెలిపారు. ఈపూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్రవాహనాల చోరీపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా నరసరావుపేట వరవకట్టకు చెందిన షేక్ అష్రఫ్,షేక్ జమీరా మీరా ఉరఫ్ రింగా, కుంకల గుంట గ్రామానికి చెందిన మేదర మిట్ల గణేష్, నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన షేక్ సల్మాన్‌లు ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సా చేస్తు న్నారు. ముప్పాళ్ళ రోడ్డులోని గోపువారిపాలెం అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ హనుమంతురావు తెలిపారు. వారి వద్ద నుండి 6 బుల్లెట్లు,3 యూనికాన్‌లు,5 స్కూటర్లు,1 షైన్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు, ఈపూరు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు, సిబ్బందికి రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఈ సంబర్భంగా డీఎస్పీ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

రంగా వర్సిటీలో పీజీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్స రానికి వివిధ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంబీఏ(ఏబీ), పీహెచ్‌డీ, ఎంబీఏ(ఏబీ-ఎస్ఎఫ్‌క్యూ) ప్రోగ్రాముల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 వరకు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి, హార్డ్ కాపీని వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఈ నెల 22లోగా వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందించాలని సూచించారు.

మత్స్యశాఖ పథకాల అమలుకు తాజా మార్గదర్శకాలు జారీ

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖలో రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ గల లబ్ధిదారుల పథ కం, ప్రాజెక్టులు సజావుగా అమలు చేయడానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కొన్ని సవరణలతో మంగళవారం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అలా గే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.50 లక్షల కంటే తక్కువ, రూ.50 లక్షల కంటే ఎక్కువ వ్యయంతో గ్రౌండింగ్ చేసిన యూనిట్లలో వాస్తవ పరిస్థితిని నిర్ధారించడానికి జిల్లా మత్స్యశాఖ అధికారి ఛైర్మన్‌గా కమిటీని నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది.

21 పోస్టులతో 5 ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ మంగళవారం ఐదు నోటిఫికేషన్లు జారీచేసింది. రెండు జూనియర్ లెక్చరర్, ఒక బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, అటవీ శాఖలో 13 డ్రాఫ్ట్‌మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్, గ్రామీణ తాగునీటి విభాగంలో మూడు ఏఈఈ, ఉద్యాన శాఖలో రెండు హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేసింది. ఇందులో మొదటి రెండు నోటిఫికేషన్లకు అక్టోబరు 7 వరకు, మిగిలిన మూడు నోటిఫికేషన్లకు 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

స్పౌజ్ టీచర్లందరికీ బదిలీలు చేపట్టాలి: ఏపీటీఎఫ్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లందరికీ అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పాఠశాల విద్యాశా ఖను కోరారు. గత నెలలో ఇచ్చిన అంతర్ జిల్లాల బదిలీల మార్గదర్శకాలకు అనుగుణంగా స్పౌజ్ కోటాలో బదిలీకి అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే ఆయా జిల్లాల్లో ఉండే ఖాళీలు, అవసరం, మిగులు ఆధారం గా కొన్ని దరఖాస్తులను ప్రభుత్వ అనుమతికి పంపకపోవ డంతో ఆ టీచర్లు ఆవేదన చెందున్నారని పేర్కొన్నారు. దర ఖాస్తు చేసుకున్న అందరికీ కొత్త డీఎస్సీ నియామకాలకు ముందే బదిలీలు చేపట్టాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.


చరిష్మా సూపర్ మార్కెట్ నిర్వాహకులపై చీటింగ్ కేసు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చరిష్మా సూపర్ మార్కెట్ నిర్వాహకులు ఏలూరు నాగేశ్వరరావు, ఏలూరు స్రవంతి, ఏలూరు చరిష్మాలపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో చీటింగ్ కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తాను చరిష్మా సూపర్ మార్కెట్ వారు నిర్వహించిన మూడు లక్కీ స్కీముల్లో సభ్యునిగా ఉన్నానని.. నెలకు రూ.2000 చొప్పున 36 నెలలు పైకం చెల్లించానని దండా అనిల్ కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమయం ముగిసినా డ్రా తీయడం లేదని.. నగదు కూడా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనిల్ కుమార్‌తో పాటు మరో ఏడుగురు కూడా తాము మోసపోయినట్లు ఫిర్యాదు చేశారు. బాధితులు కొన్ని వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

చోరీపై పోలీసుల దర్యాప్తు

నాదెండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూబాడు గ్రామంలో జరిగిన నగదు చోరీపై నాదెండ్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం గ్రామానికి చెందిన దుద్దుకూరి పౌలు రాజు కుటుంబ సభ్యులు పొలం వెళ్ళగా ఇంటితో పాటు బీరువా తాళాలు పగల గొట్టి రూ. 3 లక్షల నగదును చోరీ చేశారు. పౌలు రాజు గొర్రెలను అమ్మగా వచ్చిన సొమ్మును సోమవారం బ్యాంకులో జమ చేసి ఆభరణాల రుణాన్ని రెన్యువల్ చేయించు కోవాలని భావించారు. ఐతే పొలం నుంచి వచ్చేటప్పటికీ నగదు చోరీ జరిగింది. ఈ విషయంపై బాధితుడు ఫిర్యాదు మేరకు నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. బాధితుడి వద్ద డబ్బు ఉన్న విషయం తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌గా రత్న షీలామణి



ఏఎన్‌యూ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవి ద్యా లయం ఆంగ్ల విభాగ ఆచార్యులు, ప్రస్తుత వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కే రత్న షీలామణి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 84 పేరుతో ప్రభుత్వ కార్య దర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లపాటు ఆమె పదవిలో ఉంటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కే రత్న షీలామణిని వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఏపీ ఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పు



ఏవీవీఎస్ స్వామి ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్

ఏఎన్‌యూ సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉన్నత విద్యా మండ లి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా అనుబంధ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు మంగళవారం కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి తెలిపారు. వెబ్ ఆప్షన్స్ కళాశాలల ఎంపిక ప్రక్రియ ఈనెల 17వ తేదీ వరకు జరుగుతాయని, వెబ్ ఆప్షన్స్ కళాశాల మార్పు 18వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ప్రక్రియ ఈ నెల 20వ తేదీన జరుగుతుందన్నారు. 22 నుంచి బీఈడీ తరగతులు ప్రారంభమవు తాయన్నారు. ఆయా కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలని కోరారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో నాలుగో విడత ప్రవేశాలకు ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ ఏపీ డాట్ జీవో వీ డాట్ ఇన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ తెనాలి, జిల్లా స్థాయి శిక్షణా కేంద్రము, ప్రభుత్వ ఐటీఐ గుంటూరులో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు, 9391402683 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నాగార్జున కొండను సందర్శించిన ఆర్టీఐ కమిషనర్



లాంచీ స్టేషన్ వద్ద ఆర్టీఐ కమిషనర్ సునీల్

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ మంగళవారం సందర్శించారు. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో ఆయన కొండకు చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహంను సందర్శించారు. నాగార్జున సాగర్ ప్రాముఖ్యతను పర్యాటక శాఖ ఉద్యోగులు ఆయనకు వివరించారు. ముందుగా ఆయన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయన వెంట సివిల్ సప్లయి డీటీ బాషా, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఆర్ఐ అనిల్‌కుమార్, వీఆర్వో రవికుమార్ తదితరులు ఉన్నారు.

రావిపాడులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నరసరావుపేట రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం రావిపాడు గ్రామంలో పక్కా సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేయగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద సుమారు 250 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ ఈ సంబర్భంగా తెలిపారు.

గోనేపూడి వాగులో గల్లంతైన యువకుడు మృతి



వినయ్ (ఫైల్‌ఫొటో)

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) నరసరావుపేట మండలం గోనెపూడి గ్రామంలో గల వాగులో ఆదివారం సాయంత్రం గల్లంతయిన యువకుడు వినయ్ (16) మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమయింది. ఆదివారం నరసరావుపేట మండలం గోనేపూడి - చింతలపాలెం గ్రామాల మధ్యగల వాగు ఉధృతంగా ప్రవహించింది. గోనెపూడి గ్రామానికి చెందిన వినయ్ తన మోటార్ సైకిల్ పై వాగుని దాటే క్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సోమవారం సాయంత్రం వాగు ఉధృతి తగ్గటంతో వినయ్ మృతదేహం వాగులో ఉన్న రెండు సమాధులు మధ్యలో చిక్కుకొని ఉంది. వినయ్ మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పంచినామా నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. వినయ్ మృతి చెందడంతో గోనేపూడి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

42,929 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,052 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,929 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,801 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14300
నెంబరు. 5	10000	13400
273	10000	13500
341	10000	15000
4884	---	----
సూపర్ 10	11500	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
షార్క్-1	-----	---
బ్యాడిగి	10000	16000
దేవనూరు డీలక్స్	10000	13800

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12500
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14200
నెంబరు. 5	10000	13500
273	10000	13700
341	11000	15800
4884	10000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి	10000	16000
దేవనూరు డీలక్స్	10500	14300
తాలుకాయలు	5000	7000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుర్గి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగుట్ల, మించాలపాడు, లక్ష్మీపురంతండా, మంగాపురంతండా, కంచరగుంట గ్రామాల్లో బుధవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలి

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలోని ఉద్దండ్రాయుడిపాలెంలో బుధవారం జరిగే విశ్వకర్మ జయంతి వేడుకల్లో మండలపరిధిలోని విశ్వకర్మలందరు పాల్గొనాలని సంఘ నాయకులు సిద్దు కామేశ్వరరావు తెలిపారు. మంగళవారం అమరావతిలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ వేడుకలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివి మాధవ్, విశ్వకర్మ జాతీయ నాయకులు మోహనశర్మ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు



శివాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చినఅగ్రహారంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రహోమం చేశారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

క్రోసూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దొడ్లేరు, హసానాబాద్, నాగవరం హైస్కూళ్ళల్లో సభ్యత్వాలను ముమ్మరంగా నమోదు చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

అవసరం మేరకే రసాయన ఎరువులు వాడాలి

నకరికల్లు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు అవసరమైన మేరకే రసాయన ఎరువులు వాడాలని ఏవో కే దేవదాసు సూచించారు. మంగళవారం చేజర్లలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. భాస్వరం సంబంధ ఎరువులను ఆఖరి దమ్ములో మాత్రమే వాడాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేస్తున్న అన్ని పంటల ను ఈ పంటలో నమోదు చేయాలన్నారు. నానో యూరియాను, నానో డీఏపీని పంటలకు పైపాటుగా పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మేరీ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ మహిళా నాయకురాలు అప్పమ్మ మృతి



దాచేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా సాయుధ పోరాటంలో క్రియాశీలకంగా పనిచేసి అనంతరం సీపీఐ నాయకురాలిగా పార్టీలో విశేషమై సేవలు అం దించి వయోభారంతో సోమవారం రాత్రి మందపాటి అప్పమ్మ తుది శ్వాస విడిచారు. మృతురాలు అప్పమ్మ సీపీఐ నాయకురాలిగా 50 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పని చేశారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న సీపీఐ నాయకులు, ఇతర పార్టీలకు చెందిన నేతలు హాజరై భౌతిక దేహానికి నివాళులర్పించారు.

సీపీఐ నేత కొండలు మృతి

దుర్గి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన సీపీఐ నేత బత్తుల కొండలు సోమవారం అనారోగ్య కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న సీపీఐ నేతలు పోలేపల్లి గ్రామానికి చేరుకొని కొండలు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, పాలచర్ల సత్తయ్య, సోములు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఆలోచనా విధానాలను అనుసరించాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు జవాబుదారీగా ఉండాలి
- నియోజకవర్గంలో భూమాయను వెలికి తీయిస్తున్నాం
- రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే యరపతినేని



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో నెంబరు-1గా చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న ఆలోచనా విధానాలను ప్రతిఒక్కరు తెలుసుకొని అనుసరించాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమై రాష్ట్రం పురోగతి వైపు పయనిస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అధ్యక్షతన మాచవరంలోని మునసబ్ కల్యాణ మండపంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గురజాల నియోజకవర్గంలో అన్ని మండలాల్లో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, 2019 నుంచి 2024 వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో నియోజకవర్గంలో రెండు వేల ఎకరాల భూమాయ జరిగిందని, వివిధ బ్యాం కుల్లో అక్రమంగా లక్షలాది రూపాయల రుణాలు తీసుకొని ఇప్పటికీ చెల్లించకుండా వైసీపీ నాయకులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 1600 ఎకరాలను అక్రమంగా గుర్తించామని, మిగిలిన నాలుగు వందల ఎకరాలను కూడా గుర్తించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. ఆయా సొసైటీల్లో ఇష్టానుసారం లక్షల రుణాలు తీసుకొని ఇష్టానుసారం వైసీపీ నాయకులు వ్యవహరించారని, వడ్డీతో సహా కట్టించ డమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. నియోజకవర్గంలో సమస్యలపై ప్రజలు కార్యాలయాలకు వస్తుంటారని, ముందుగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి వారి సమస్యలను విని వెంటనే పరిష్కరించాలని యరపతి నేని అధికారులకు సూ చించారు. ప్రతి ఒక్క అధికారి, ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ప్రజా సమస్యలు తీరుస్తూ ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలే తప్ప వారి పట్ల దురుసుగా వ్యవహరించ కూడదని హిత బోధ చేశారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు అర్జీల రూ పంలో స్వీకరించి వాటి పరిష్కార మార్గానికి అక్కడికక్కడే కొన్ని పరిష్కరించారన్నారు.

గురజాలలో లక్ష స్మార్ట్ రేషన్ కార్డులు : ఆర్డీవో

గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు లక్ష స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. మాచవరం మండలంలో 16,196 కార్డులు పంపిణీ చేస్తామని, మిగిలిన మండలాల్లో కూడా కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ నిర్వహిస్తారన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఆయన తెలియజేశారు. సమీక్షలో పిడుగురాళ్ళ మార్కెట్‌యార్డు ఛైర్మన్ తురకా వీరాస్వామి, మండల అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు : యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో మంగలవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 56 మందికి 68 లక్షల 96 వేల 211 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ దఫా మాడుగుల గ్రామానికి చెందిన శ్రీరామ అమ రలింగాచారికి రూ.4 లక్షలు, పులిపాడు గ్రామానికి చెందిన ఓర్సు రమణకు రూ.6 లక్షల ఎల్‌వోసీలను ఎమ్మెల్యే యరపతినేని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, ఏఎంసి ఛైర్మన్ తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, తదితర నాయకులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న యరపతినేని

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుంచాలి
- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారులందరూ సమన్వయంతో పని చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుంచాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు, విద్యుత్, రెవెన్యూశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ సమస్యలను పరి ష్కరించేలా ఐదు మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, నూతన విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రైతులతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సకాలంలో వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించటంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జోన్-3 పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) జోన్-3 పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని జోన్లలో పంచాయతీ కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం ప్రమోషన్‌లు ఇస్తే జోన్-3 కార్యదర్శులకి పలు కేసుల వల్ల ప్రమోషన్లు నిలిచిపోయాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్, నాగరాజు, సుధాకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నరసరావుపేటలో సాఫ్ట్ టెన్నిస్ బాల్ జట్ల ఎంపిక

సత్తెనపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడుజిల్లా సాఫ్ట్ టెన్నిస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నరసరావుపేటలోని శిశుమందిర్ పాఠశాలలో సీనియర్ మహిళల, పురుషుల జట్ల ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పీ నవీన్‌కుమార్, కార్యదర్శి ఎం నరసింహారావులు మంగళవారం విలేకరులకు తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మీ విజయాలు అభినందనీయం : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మీ విజయాలు అభినందనీయం.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దకు తీసుకెళ్లే బాధ్యత నాది అంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మండలంలోని విజయపురిసౌత్‌లో గల ఏపీఆర్‌డీసీ విద్యార్థులనుద్దేశించి అన్నారు. క్రీడల్లో రాణిస్తున్న ఏపీఆర్‌డీసీ విద్యార్థులను మంగళవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అభినందించారు. గత జూలైలో యూత్ అండ్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఏపీఆర్‌డీసీకి చెందిన ఎన్ హరికృష్ణ లాంగ్‌జంప్, జె.నాగరవీంద్ర 200మీటర్ల రన్నింగ్, ఎన్ అంజినాయక్ 100 మీటర్ల పరుగుపందెంలలో బంగారు పతకాలు సాధించారు. అలాగే నంద్యాల జిల్లా ఓక్‌లో జరిగిన ఇంటర్‌జోనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భరత్‌రెడ్డి బంగారు పతకం, ఎస్‌కే నజీర్ వెండిపతకం సాధించారు. ఈ విద్యార్థులను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నయీంభాను, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజయకుమార్, వెంకట్రామిరెడ్డి, నాగరాజు, ఎస్‌కే మహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు గురజాలకు ఎమ్మెల్యే యరపతినేని రాక

గురజాలటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు గురజాల మండలస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురజాల టీడీపీ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేయడానికి చేయడానికి ముఖ్యఅతిథిగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరుకానున్నారు. అలాగే ఆర్డీవో మురళీకృష్ణ, మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు.

నేడు మండల పరిషత్ సాధారణ సమావేశం

- ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్

మాచర్ల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు నూతన ఉపాధ్యాయులకు సన్మానసభ

మాచర్ల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికై జిల్లాలో నియామకం పొందనున్న నూతన ఉపాధ్యాయులకు పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు సన్మానసభ నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ కొమ్ము కిషోర్ తెలిపారు. ఈ సన్మానసభకు జిల్లా అధ్యక్షుడు సంపత్‌బాబు హాజరవుతారన్నారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కిషోర్ కోరారు.

మండలానికి 16,238 స్మార్ట్ రేషన్‌కార్డులు

- తహసీల్దార్ కరుణకుమార్

దుర్గి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో 16,238 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ కరుణకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డులు లేని వారికి నూతనంగా రేషన్‌కార్డులు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయాల వద్ద వీటిని పొందాలన్నారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి వీరికి రేషన్ పంపిణీ చేస్తారన్నారు.

ప్రయాణికుల రూపంలో మహిళా దొంగలు

- రూ.11 వేల నగదు, సెల్ ఫోన్ అపహరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

రెంటచింతల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రూపంలో మహిళా దొంగలు చెలరేగిపోతున్నారు. ఫ్రీ బస్ ఎక్కడం అన్న క్యాంటిన్‌లో భోజనం చేసే ఇద్దరు మహిళలు మంగళవారం రెంటచింతలలో బస్సు ఎక్కే ప్రయాణికురాలి పర్సును అపహరించి చివరకు దొరికిపోయారు. వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు టౌన్‌లో మర్రిచెట్టు సెంటర్‌కు చెందిన ఇద్దరు మహిళలు ఒక పాపతో కలిసి బస్సు ఎక్కుతున్న పి.సుశీల పర్సులోని రూ.11 వేల నగదు,సెల్ ఫోన్, ఆధార్‌కార్డును దొంగిలించారు. బాధిత మహిళల ఆరోపణ మేరకు పాలువాయి జంక్షన్‌లో బస్సును తనిఖీ చేయగా మహిళా దొంగలు పరుగెత్తారు. జంక్షన్‌లోని మసీదు వద్ద పట్టుకుని విచారించగా నగదును, సెల్‌ఫోన్, ఆధార్ కార్డును అందచేశారు. అనంతరం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రణభేరి సభను జయప్రదం చేయండి

దాచేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సక్రమంగా స్పందించక పోవటంతో ఉపాధ్యాయ సంఘాలు తమదైన శైలిలో నిరసన వ్యక్తం చేసే కార్యక్రమంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరీ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దాచేపల్లిలోని యూటీఎఫ్ కార్యాలయంలో రణభేరి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈనెల 25న విజయవాడలో 25వేల మందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగసభ ఏర్పాటు కార్యక్రమంలో ఈనెల 18వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జాతర ప్రవేశించి అక్కడి నుంచి నరసరావుపేట, నకరికల్లు మీదుగా పిడుగురాళ్ళకు చేరుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు ప్రాంతంలోని ఉపాధ్యాయులందరూ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారావు, ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, మోజెస్, రాంబాబు, కొండలు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి టీకాల పంపిణీ

క్రోసూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 88 తాళ్ళూరు, అనంతవరం గ్రామాల్లో మంగళవారం తెల్లజాతి పశువులకు, గేదెలకు ముమ్మరంగా గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. 88 తాళ్ళూరులో పశు వైద్యాధికారి డాక్టర్ బషీర్, అనంతవరంలో డాక్టర్ రవి కిరణ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూక్ష్మ క్రిముల వల్ల పశువుల్లో గాలి కుంటు వ్యాధి సోకుతుందని, దీనివల్ల గేదెల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని, సకాలంలో టీకాలు వేయిస్తే వ్యాధిని అరికట్టవచ్చన్నారు. టీకాల పంపిణీ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ కోడెల శివప్రసాద్‌కు ఘన నివాళులు



తాలూకా సెంటర్లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్, టీడీపీ నేతలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ శాసనసభ తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 6వ వర్ధంతిని మంగళవారం తాలూకా సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు కోడెల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, పూజల వెంకట కోటయ్య, బాపయ్య చౌదరి, మస్తాన్‌వలి, మారెళ్ళ మల్లేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, చిన అబ్దుల్లా, నూర్‌బాషా జానీ బాబు, రాంబో బుడే, కట్టా శంకరరావు, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్లో ఉన్న కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ పెద కరీముల్లా, నలబోతు పాపారావు, పున్నయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి మండలంలోని భీమవరం, గోరంట్ల, లక్ష్మీపురం, పెదమక్కెన, రెంటపాళ్ళ, గుండ్లూరు గ్రామాల్లోని కోడెల విగ్రహాలకు ఆయా గ్రామాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● నకరికల్లులోని టీడీపీ కార్యాలయంలో కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి వెంకటరావు, మైలవరపు కాశీ, దూదేకుల హుస్సేన్‌బీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెం మండలంలోని గణపవరం, కొండమోడు గ్రామాల్లో కోడెల వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కొండమోడులో ఉన్న అనాథ పిల్లల ఆశ్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాబురావు సహా కారంతో అన్నదానం చేశారు. గణపవరంలో కోడెల శివప్రసాదరావు, ఎన్టీఆర్ విగ్రహాలకు ఆ గ్రామ టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



అచ్చంపేట మండలంలోని రుద్రవరంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్, టీడీపీ నాయకులు

అచ్చంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలోని రుద్రవరం గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పంపిణీ చేశారు. ఆయనతో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, అక్కల వెంకట రామిరెడ్డి, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వెంకటాయపాలెం సర్పంచ్ శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 19,703 మందికి పంపిణీ

క్రోసూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం పూర్తయినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలియజేశారు. మొత్తం 19,703 మందికి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు కార్డులు పంపిణీ చేశామన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, స్థానిక టీడీపీ నాయకులు స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్ర మంలో పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల వద్ద తీసుకోవాలి

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మం జూరు చేసిన రేషన్ స్మార్ట్‌కార్డులను లబ్ధిదారులు రేషన్ డీలర్‌ల వద్దకు వెళ్లి తీసుకోవాలని తహసీల్దార్ డానియేలు తెలిపారు. మండలంలో 45 రేషన్ దుకాణాలకు గాను 21,815 కార్డులు మంజూరు కాగా మంగళవారం సాయంత్రానికి 5,500 పంపిణీ చేశారని తెలిపారు. కార్డుల పంపిణీ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని డీలర్‌లను ఆదేశించారు.



పెరికపాడులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు

● వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడులో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు మంగళవారం తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అందించారు. మండలానికి మొత్తం 15,978 స్మార్ట్ కార్డులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిరిగిరిపాడులోస్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న శివారెడ్డి

● సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడులో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పాకాలపాడు పీఏసీఎస్ ఛైర్మన్ కొనికినేని సత్యనారాయణ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు షేక్ నన్నె సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు



మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకల్లో బీజేపీ నేత రాజశేఖరరెడ్డి, తహసీల్దార్, డాక్టర్ల బృందం

రెంటచింతల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను బీజేపీ యువమోర్చా నేత ఇగుటూరి రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మేరి కనకం, డాక్టర్లు కృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సైదులు యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి పుల్లారెడ్డి, జి.నాసరయ్య, లక్ష్మీ, హనుమంతరావు, రాగిడి థామస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు బాగుంటేనే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయి

- వైద్యుడు రవితేజానాయక్

రాజుపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు బాగుంటేనే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు రవితేజానాయక్ అన్నారు. మంగళవారం రాజుపాలెంలో ఉన్న పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రవితేజానాయక్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి అభయం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 3 వ తేది వరకు మండలంలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ వైద్యశిబిరాలను మహిళలు సద్వినియోగించుకోవాలని కోరారు.

క్రోసూరు పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ

క్రోసూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి, కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని సచివాలయాల్లో స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. ఆరోగ్యవంతమైన స్త్రీ, శక్తివంతమైన కుటుంబం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సనీ గఫ్రూన్ మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామసన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో అంజయ్య, టీడీపీ నేతలు

కారంపూడి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని పాత ఎస్సీ కాలనీలో మాల కన్నమనీడు యూత్ ఆధ్వర్యాన పోలేరమ్మ, పాతపాటేశ్వరమ్మ దేవాలయాల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెదకాపు బొమ్మిన శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, వైస్ ఎంపీపీ గాడిపర్తి పూర్ణయ్య, సర్పంచ్ బాలునాయక్, సొసైటీ ఛైర్మన్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఐటీడీఏ పీవో శివప్రసాద్ మంగళవారం స్థానిక పీటీజీ పాఠశాల, ఎత్తిపోతలలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లోని వసతులను పరిశీలించి సిబ్బం దికి పలు సూచనలు చేశారు. ఆలిండియా బంజార సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ భీమానాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ వెంకటేష్ నాయక్‌లు పీవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో అమర సుబ్బయ్య, ప్రిన్సిపాల్స్ దుర్గా భవాని, మురళీకృష్ణ, టీడీపీ నేతలు రాజ్‌కుమార్, ఆర్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లకు.. నైవేద్యాలు

- నిత్యకైంకర్యాలకు నోచుకోని వైనం
- ఆక్రమణల్లో ఆలయాల భూములు
- పూర్వవైభవానికి నోచుకోని దేవాలయాలు


వినుకొండ బోసుబొమ్మ సెంటర్‌లోని ప్రసన్నరామలింగేశ్వరస్వామి దేవాలయం


పాత శివాలయ ఆవరణలో అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయం

వినుకొండటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అవి పురాతన దేవాలయాలు. మొక్కిన వారికి కొం గు బంగారం ఆలయాల్లోని దేవుళ్లు ఉన్నారు. పెద్దఎత్తున భూములు కూడా ఉన్నాయి. వినుకొండలోని ఆయా ఆలయాల్లో దేవుళ్లకు నైవేద్యాలు పెట్టేవారే లేరు. దేవదాయ శాఖ ఈ ఆలయాల్లో నిత్యకైంకర్యాలు జరగడంలేదు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పేరుగాంచిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంతో పాటు పట్టణంలోని పాతశివాలయం, కోదండరామస్వామి ఆలయాలు చారిత్రాత్మక ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. కొండపై రామలింగేశ్వ రస్వామి ఆలయానికి 11 ఎకరాలు, ప్రసన్నరామలిం గేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలకి 65 ఎకరాలు, తిమ్మాయపాలెం రోడ్డులోని రంగనాయక స్వామి దేవాలయానికి 35 ఎకరాలకు అప్పట్లో భక్తు లు సమర్పించారు. కోదండరామస్వామి ఆలయానికి 1920లో 1460 ఎకరాలు భూమి ఉన్నాయని ఆధారాలు ఉండగా ఆక్రమణలు పోను ప్రస్తుతం కేవలం 65 ఎకరాలకు మాత్రమే ఉన్నాయి. ఈ దేవాలయాలకు నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. భక్తులు సమర్పించే కానుకలు, చందాల రూపంలో దేవాలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వయంగా శ్రీరాముడు శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతుంది. 11 ఎకరాల భూమి ఉన్నా స్వామివారు దూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయ పునః నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శ్రీరాముడు నిర్మించిన ఆలయాన్ని తొలగించారు అప్పటి నుంచి ఆలయం పునఃనిర్మాణానికి నోచుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామి సన్నిధిలో హోమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ముందుకు సాగడంలేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ఆలయ పనులు చేపడతామని దేవాదాయ శాఖ అధికారి సుధాకరరెడ్డి తెలిపారు.


కొండపై అసంపూర్తిగా నిలిచిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం

పాపం.. జ్యోతి

- మూడేళ్ల వయసు నుంచి అంధత్వం
- అండగా ఉన్న తల్లితండ్రి మృతితో రోడ్డున పడిన వైనం
- ఎనిమిదేళ్ల కుమారుడి పోషణ కోసం భిక్షాటన
- సీఎం కరుణ కోసం అభాగ్యురాలి ఎదురు చూపులు


కుమారుడు సహాయంతో రోడ్డు మీద బిక్షాటన చేస్తున్న పాములపాటి జ్యోతి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

జీవితమంతా కష్టాలే అంటే పాములపాటి జ్యోతి జీవితమే నిదర్శనంగా కనిపిస్తోంది. పుట్టిన మూడేళ్లకే కళ్లు పోయాయి. కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిదండ్రులు హఠాత్తుగా మరణించారు. చేదువాదోడుగా ఉంటాడులే అనుకుని ఓ వ్యక్తి చెయ్యి పట్టుకుంటే బిడ్డ కడుపులో పడగానే వదిలేసి పత్తాలేకుండా పోయాడు. ఇప్పుడు ఆమె నడి రోడ్డు మీద ఉంది. ఎనిమిదేళ్ల బిడ్డను పోషించుకునేందుకు లోకాన్ని సరిగా చూడలేని ఆ తల్లి నానాయాతన పడుతుంది. మేడికొండూరు గ్రామానికి చెందిన జ్యోతి(ప్రస్తుతం గుంటూరులోని పాతగుంటూరు కృష్ణ కల్యాణ మండపం దగ్గర నివాసం ఉంటుంది) మూడేళ్ల వయసులో ఆడుకుంటూ కింద పడటంతో చూపు కోల్పోయింది. అప్పటి నుంచి తండ్రి మల్లేశ్వరరావు, తల్లి రమాదేవి కళ్లు లేని జ్యోతికి కళ్లుగా మారారు. 2007లో తండ్రి మల్లేశ్వరరావు గుండెపోటుతో మరణించిన తర్వాత జ్యోతి తల్లి మీదనే ఆధారపడ్డారు. 2018లో తల్లి రమాదేవి కూడా మరణించటంతో జ్యోతి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తల్లి, తండ్రి మరణించిన తర్వాత పూర్తి అయోమయ స్థితిలో ఉన్న జ్యోతిని వివాహం చేసుకునేందుకు ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. పెళ్లి చేసుకుని కొద్ది రోజులు కాపురం చేసిన తర్వాత చెప్పా పెట్టకుండా వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటికే తాను గర్భం దాల్చానని బాధితురాలు చెబుతున్నారు. అబార్షన్ చేయించుకోవాలని చాలామంది సలహా ఇచ్చినా జ్యోతి అంగీకరించలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత రక్షణకుమార్ అని పేరు పెట్టినట్టు వెల్లడించారు.

బిడ్డ కడుపు నింపటానికి బిక్షాటన...

ప్రస్తుతం పాత గుంటూరు కృష్ణ కల్యాణ మండపం సమీపంలోనిఅద్దె ఇంట్లో నివసిస్తున్న జ్యోతి ఎనిమిదేళ్ల బాబును పోషించుకునేందుకు బిక్షాటన చేస్తున్నారు. బిక్షాటన చేయగా వచ్చిన సొమ్ముతోనే బాబును పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ 'అడుక్కునే వాళ్లు' అనే పేరుతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తన బిడ్డను చిన్నచూపు చూస్తున్నట్లు జ్యోతి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఒక్కో రోజు రోడ్డు మీదకు వెళ్లాలంటే చాలా భయం వేస్తుందని ఆవేదన చెందుతున్నారు. 'రూపాయి ధర్మం చేయమని అడిగితే కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తారని వాపోయారు.

సీఎం కలవాలని ప్రయత్నం చేసినా...

జ్యోతి బయటకు రావాలంటే కచ్చితంగా ఎవరో ఒకరి సాయం ఉండాల్సిందే. అటువంటి పరిస్థితిలో కూడా మూడు, నాలుగు సార్లు సీఎంను కలవడానికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితురాలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ దగ్గరికి వెళ్లినా కూడా అదే అనుభవం ఎదురైందని చెబుతున్నారు.

సీఎం సర్ కనికరించాలి...

ఇప్పటి వరకు ఎన్నో కష్టాలు పడ్డాను. ఇక నా వల్ల కావడం లేదు. సీఎం సర్ దృష్టికి నా విషయం వెళ్తే ఆయన కచ్చితంగా న్యాయం చేస్తారు అన్న నమ్మకం నాకు ఉంది. ప్రస్తుతం ఆయన ఇచ్చే ఆరు వేలు పెన్షన్‌తోనే ఇంటి అద్దె మూడు వేలు, కరెంట్ బిల్లు వెయ్యి చెల్లించి జీవిస్తున్నాను. సీఎం స్పందించి ఇల్లు, బిడ్డ చదువుకి సాయం చేస్తే ప్రశాంతంగా ఉండగలుగుతాను. ఆర్థిక సహాయం చేయాలనుకుంటే 8341233852 నెంబర్‌లో సంప్రదించండి.

-పాములపాటి జ్యోతి, బాధితురాలు

అమ్మా...ఎలా ఉన్నారు?

- అతివల ఆరోగ్యంపై 17 నుంచి ప్రత్యేక శిబిరాలు
- బలమైన కుటుంబానికి పునాది లక్ష్యంతో ముందుకు

సత్తెనపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమే కాదు ఆరోగ్య వంత మైన సమాజం నెలకుంటుంది. మహిళల ఆరోగ్యం బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. అందులోనే పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ ఐతే తీసుకోవాల్సిన చికిత్స పై వివరిస్తారు. రుగ్మతలు ఎలా వ్యాప్తి చెందుతాయో, వాటి భారిన పడకుండా అప్రమత్తంగా ఉండటం పై అవగాహన కల్పిస్తారని వైద్యులు తెలిపారు.

వైద్యుల పర్యవేక్షణలో...

గ్రామీణ, పట్టణాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లలో ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించేలా ఆయా ఆస్పత్రుల వైద్యులకు సూచించారు.

ఏఏ అంశాల పై పరీక్షలు చేస్తారంటే...

అధిక రక్త పోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. మహిళల్లో రక్త హీనత ఎలా వస్తుంది?, దానిని అధిక మించటం ఎలా?, తీసుకోవాల్సిన ఆహారం పై కౌన్సిలింగ్ ఇస్తారు. గర్భిణీల్లో హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు చేస్తారు. శిశు రక్షణ కార్డుల పంపిణీ, పిల్లలకు రోగ నిరోధక శక్తి అందించటం పై అవగాహన కల్పిస్తారు. కౌమార దశలో ఉన్న బాలికలకు రుతు పరిశుభ్రత, పోషకాహార కార్యక్రమం పై అవగాహన కల్పిస్తారు. చెక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించటంపై మహిళా స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ రాజ్ సంస్థలు, మహిళా ప్రతినిధులతో సమావేశాలు, పోషకాహారం పై సూచనలు ఇస్తారు.



అమరావతి బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు మట్టి నమూనాల సేకరణ

- చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమానులో కొనసాగుతోన్న డ్రిల్లింగ్ వర్క్స్
- శాంపిల్స్ టెస్టింగ్‌కు హరియాణాలోని గురుగ్రాంకు రవాణా
- ఎలైన్‌మెంట్‌పై రకరకాల ఊహాగానాలు

గుంటూరు, వట్టిచెరుకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై వయా అమరావతి రాజధాని హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ప్రాథమికంగా అవసరమైన ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్‌ఎల్‌ఎస్) గుంటూరు జిల్లాలో ప్రారంభ మైంది. ఇందులో భాగంగా డీపీఆర్ రూపకల్పన, ఫైనల్ ఎలైన్‌మెంట్ డిజైన్, ట్రాఫిక్ సర్వే రిపోర్టు, ఆర్‌వోఆర్ లెక్కలు, సవివర అంచనాలు, ఈపీసీ తయారు చేయడం వంటివి చేపట్టారు. అలానే టెరెస్టియల్ లిడార్ సర్వే(గ్రౌండ్ బేస్డ్ లేజర్ సర్వే) కూడా చేపట్టనున్నారు. ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో భారీ యంత్రాలను ఉపయోగించి మట్టి నమూనాలను సేకరిస్తోన్నారు. దాదాపుగా 20 మీటర్ల లోతు వరకు వెళ్లి ప్రతీ ఐదు మీటర్లకు ఒకసారి మట్టి నమూనాని తీసుకొని ప్యాకెట్లలో నింపి వాటిని టెస్టింగ్ నిమిత్తం హరియాణ రాష్ట్రంలోని గురుగ్రాం లేబొరేటరీకి రవాణ చేస్తోన్నారు. దీంతో ఎలైన్‌మెంట్ ఏ ఊళ్ల మీద నుంచి ఉంటుందనే ఆసక్తి సర్వత్రా నెలకొన్నది.


వట్టిచెరుకూరు మండలంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం జరుగుతున్న మట్టి నమూనాల సేకరణ

దేశంలో మొట్టమొదటి హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ అయిన అహ్మదాబాద్ - ముంబై సెక్షన్ పూర్తి కావొస్తోండటంతో ఎన్‌డీఏ-3 ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ - అమరావతి - చెన్నై సెక్షన్‌లో దీనిని నిర్మించాలని ఇప్పటికే ప్రాథమికంగా నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు మీదగా హైదరాబాద్ - చెన్నై ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని ఎలైన్‌మెంట్ చేయాలని ప్రతిపాదించింది. ఆ మేరకు ఇప్పుడు సర్వే జరుగుతోన్నది. ఇందుకోసం 744.57 కిలోమీటర్ల సెక్షన్‌ని ఎంపిక చేశారు. ఫ్యూచర్ సిటీ నుంచి ప్రారంభమై శంషాబాద్, నార్కెడ్‌పల్లి, సూర్యపేట, కోదాడ, అమరావతి రాజధాని, గుంటూరు, చీరాల మీదగా చెన్నైకి ఎలైన్‌మెంట్ చేయాలని భావిస్తోన్నారు.

కాగా ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో మట్టి శాంపిల్స్ తీస్తుండటంతో ఎలైన్‌మెంట్‌పై విస్తృతంగా చర్చలు జరుగుతోన్నాయి. రైల్వే శాఖ ప్రస్తుతం ఉన్న రైలుమార్గానికి సమాంతరంగా ప్రాజెక్టు చేపడితే భూసేకరణ ఖర్చు కొంతమేరకు తగ్గుతుందని సూచించింది. అయితే చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో శాంపిల్స్ తీస్తున్న దృష్ట్యా ప్రస్తుత రైలుమార్గానికి సమాంతరంగా కాకుండా వేరే ఎలైన్‌మెంట్‌లో చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. ఇందుకు కారణం పైన పేర్కొన్న మూడు మండలాల్లో ఎలాంటి రైలుమార్గం లేదు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే అమరావతి మీదగా గుంటూరు వచ్చిన తర్వాత చేబ్రోలు మండలంలోని గొడవర్రు, వట్టిచెరుకూరులోని అనంతవరప్పాడు మధ్యగా లేమల్లెపాడు తూర్పు వైపున కొంతదూరం వెళ్లాక ముట్లూరుకు పడమర వైపు నుంచి కాకుమాను మండలంలోకి వెళుతుంది. ప్రస్తుతం సేకరిస్తున్న మట్టి నమూనాల పరీక్ష ఫలితాలు పాజిటివ్‌గా వస్తే ఎలైన్‌మెంట్ ఇటువైపు నుంచే ఉంటుంది.

దళితవాడల్లో వెయ్యి ఆలయాలు!

- మత మార్పిడులను అడ్డుకునేందుకే టీటీడీ పాలక మండలి నిర్ణయం
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రంలోని దళితవాడల్లో తొలి దశలో వెయ్యి ఆలయాలను నిర్మించాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. దళితవాడల్లో జరుగుతున్న మతమార్పిడులు అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆయా ప్రాంతాలను బట్టి రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయిస్తామని తెలిపింది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం మధ్యాహ్నం పాలక మండలి సమావేశం జరిగింది. చైర్మన్ బీఆర్ నాయుడు బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించి ఆ తర్వాత ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలక మండలి ఏర్పడ్డాక ఇవే తొలి బ్రహ్మోత్సవాలని.. ప్రతిష్ఠాత్మికంగా తీసుకుని అత్యంత వైభవంగా, దిగ్విజయంగా జరపాలని తీర్మానించామని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. 'రద్దీ నియంత్రణ కోసం తొలిసారి ఇస్రో సహకారం తీసుకోవాలని నిర్ణయించామని, ప్రతినిమిషం వారు రద్దీని పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తూ సందేశాలిస్తారు. ఎల్ అండ్ టీ సంస్థ కూడా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌కు సహకరిస్తుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పది రోజులపాటు సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశాం. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకే వీఐపీ బ్రేక్ దర్శనాలుంటాయి. వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, ఎన్నారైలకు ప్రత్యేక దర్శనాలు నిలిపివేస్తాం. భక్తులకు కావలసినన్ని లడ్డూలు ఇచ్చేలా అదనంగా 8 లక్షల లడ్డూలు తయారు చేయాలని నిర్ణయించాం. 28వ తేదీన గరుడ వాహనసేవ రోజు 3 నుంచి 4 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ రోజు శ్రీవారిమెట్టు, అలిపిరి కాలి నడక మార్గంలో 24 గంటల పాటు భక్తులను అనుమతిస్తాం' అని వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని, 24వ తేదీన మీన లగ్నంలో (సాయంత్రం 5.43-6.15 గంటల మధ్య) ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహన సేవ జరుగుతుందన్నారు. అదే రోజు రాష్ట్రప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. 2026కు సంబంధించిన టీటీడీ డైరీ, క్యాలెండరు ఆవిష్కరించడంతో పాటు మరుసటి రోజు తిరుమలలో నూతనంగా నిర్మించిన పీఏసీ-5 (వెంకట్రాది నిలయం)ను ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. బ్రహ్మోత్సవాలను మహాయజ్ఞంగా నిర్వహించేందుకు బోర్డు సభ్యులు, అధికారులు, భక్తులు సహకరించాలని కోరారు.

మరికొన్ని నిర్ణయాలు..

- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరంలో ఉన్న శ్రీవారి ఆలయంలో రాజగోపురం, ముఖమండపం, సుబ్రహ్మణ్యస్వామికి ఆభరణాలు, తాగునీటి సౌకర్యం కోసం రూ.7.20 కోట్లు.
- అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక, రాజ గోపురం, తోరణం నిర్మాణానికి రూ.5.73 కోట్లు మంజూరు.
- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో రూ.89.54 లక్షల విలువైన 74 సెంట్ల భూమిని కొనుగోలు చేసి టీటీడీకి విరాళంగా ఇచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన వెంకట్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ముందుకొచ్చారు. ఆ విరాళం స్వీకరించేందుకు ఆమోదం. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే జైలుకే

టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బీఆర్ నాయుడు హెచ్చరించారు. 'పనీపాటా లేకుండా ప్రతి చిన్న విషయానికీ టీటీడీపై ఇష్టానుసారం అవాకులు చవాకులు పేలుతున్నారు. అందుకే ఇకపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు పెట్టేలా బోర్డులో తీర్మానించాం. శ్రీవేంకటేశ్వరస్వామిపై రోజూ ఏదో ఒక అవాస్తవంతో దుమ్మెత్తిపోస్తున్నారు. చిన్న విషయాలను పెద్దవిగా చేసి టీటీడీ పరువు ప్రతిష్ఠలను దెబ్బతీస్తున్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి న్యాయవిచారణ చేయించి జైలుకు పంపుతామని చెప్పారు. వేద పారాయణదారుల పోస్టు భర్తీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

ఏపీలో 25వ భారత్ రంగ్ మహోత్సవ్

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 6,7,8,9,10 తేదీలలో జాతీయ, అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు
- వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోని అతి పెద్ద అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్ 'భారత్ రంగ్ మహోత్సవ్ 2026'కు ఆంధ్రప్రదేశ్ వేదిక కానున్నట్లు తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అన్నారు. యడ్లపాడులోని వేదిక కార్యాలయంలో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ భారత రంగ్ మహోత్సవ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. గుంటూరుపట్టణంలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో తొలిసారి అదీ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్సవాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని, దాని నిర్వహణ బాధ్యతలు వేదికకు దక్కడం గర్వకారణమన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో జాతీయ, అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు, తెలుగు రాష్ట్రాల కళాకారులచే వివిధ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ నాటక మహోత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నాటకరంగ ప్రముఖులు, కళాకారులు, నాటకరంగ అభిమానులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాపరిషత్‌ల నిర్వాహకులకు, నాటక దర్శకులు, రచయితలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని నాటక సమాజాలవారికి, వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వా నాలు అందజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఈ అంతర్జాతీయ ఉత్సవం జరగడం మనందరికీ గర్వకారణం అని తెలుగు నాటక రంగానికి ఈ ఉత్సవాలు కొత్త ఊపును ఇస్తాయన్నారు. కళాప్రియులకు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ, విజయవంతం చేయడంపై వేదిక సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో వేదిక కార్యవర్గ సభ్యులు వీవీ మల్లిఖార్జునరావు, జేవీ మోహనరావు, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి, పోపూరి నాగేశ్వరరావు, కట్టా శ్రీహరి, నడింపల్లి వెంకటేశ్వర్లు, ముత్తవరపు రామారావు, లావు వెంకటేశ్వర్లు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం, యడ్లపాడు, కొండవీటి కళా పరిషత్, లింగారావుపాలెం, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్, వరగాని, శ్రీకారం రోటరీ కళా పరిషత్, మార్టూరు, ఎన్టీఆర్ కళాపరిషత్, అనంతవరం, గుంటూరు కళాపరిషత్, గుంటూరు, కాసరనేని సదాశివరావు కళాపరిషత్, తక్కెళ్ళపాడు, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్, సాతులూరు, కళానికేతన్, వీరన్నపాలెం, ఎన్టీఆర్ కళాపరిషత్, వినుకొండ, పెదకంచర్ల గ్రామీణ కళాపరిషత్, పెదకంచర్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

శావల్యాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నర్సరావుపేట నుంచి ప్రకాశం జిల్లా కంభంకు వెళుతున్న కారు శావల్యాపురం పీహెచ్‌సీ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. కారులో ఉన్న నలుగురిలో లింగారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. లింగారెడ్డికి స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్సచేసి మెరుగైన వైద్యంకోసం 108లో వినుకొండకు తరలించారు. కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రైతు సేవా కేంద్రాల్లో ఏడీఏ తనిఖీ

రొంపిచర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం, కొత్తపల్లి, రెడ్డిపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు మంగళవారం తనిఖీచేశారు. యూరియా నిల్వలను, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో శివలలిత పాల్గొన్నారు.



కరెంటు స్తంభం వద్ద బయటకు వస్తున్న నీరు

విద్యుత్ స్తంభాల గోతులతో పైపులైన్ ధ్వంసం

● నీటి సరఫరాకు అంతరాయం

నూజెండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని అభివృద్ధి పనుల్లో భాగంగా వేసిన కరెంటు స్తంభాలు గ్రామంలోని నీటి సరఫరా పైపులైన్‌లు ధ్వంసం అవ్వటంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగిన సంఘటన మండలంలోని ముక్కెళ్ళపాడులో చోటు చేసుకుంది. కొద్దిరోజులుగా గ్రామంలో కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలను యంత్రాల ద్వారా వేస్తున్నారు. ఈ క్రమంలో భూగర్భంలో ఉన్న పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతున్నాయి. దీనిపై విద్యుత్ అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవటం వల్లే వాటర్ పైపులైన్ దెబ్బతిన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో పీ మాధురి మంగళవారం తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా...

● తుమ్మలకుంట (శావల్యాపురం) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలూరు, తుమ్మలకుంట, పోట్లూరు ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు మంగళవారం తనిఖీ చేశారు. తుమ్మలకుంట ఉపాధ్యాయులు తయారుచేసిన బొమ్మలు పరిశీలించి హెచ్‌ఎం రాజారమేష్, ఉపాధ్యాయులను అభినందించారు. పోట్లూరులో మధ్యాహ్నభోజనంను పరిశీలించారు.

● ఈపూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల, ఈపూరు మండలాలలోని మద్యం దుకాణాలలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● శావల్యాపురం: ఆర్‌బీఐ, యూనియన్ బ్యాంక్ వారి సహకారంతో అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శావల్యాపురంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వద్ద మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అవార్డు సంస్థ కౌన్సిలర్లు ఎప్రాయిల్, హసీనా, మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు యోహాను, టీపీఆర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత పి.వెంకటేశ్వర్లు, డిపో నాయకులు నాయక్, సాంబశివరావు, జిలాని, సుబ్బారావు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మంగళవారం గార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, యాకోబు, డి.చిట్టిబాబు, కృపావతి పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: చీరాల రోడ్డులోని వెంగళరెడ్డి కాలనీలో నిరుపేద మహిళ చిలకా రమణమ్మకు రెండు నెలలకు సరిపడా 23 రకాల నిత్యావసరాలను మంగళవారం అందించారు. యేసుతో సహవాసం అనే గ్రూపు సభ్యులు వీటిని అందజేశారు.

● చిలకలూరిపేట: పారిశుధ్య పనుల నిర్వహణపై మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో శానిటరీ ఇనస్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, మేస్త్రులతో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. శానిటరీ ఇనస్పెక్టర్ సీహెచ్ రమణారావు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: డీఎస్సీ 2025లో నియమితులైన ఉపాధ్యాయులు విధుల్లో చేరక మునుపే సీనియర్ ఉపాధ్యాయులకు పాఠశాలల్లో ఉన్న ఖాళీ స్థానాలు చూపించి, వారిని ఆ స్థానంలో సర్దుబాటు చేసి, క్లస్టర్ వేకెన్సీలలో 2025 డీఎస్సీ ఉపాధ్యాయులను నియమించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు కే కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. చిలకలూరిపేట పట్టణానికి ప్రత్యేకంగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



రావిపాడులో డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చింతమనేని ప్రభాకర్, ఎంపీ లావు, ఎమ్మెల్యే అరవిందబాబు

చిరస్మరణీయుడు కోడెల

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

రావిపాడు (నరసరావుపేట రూరల్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన దివంగత కోడెల శివప్రసాదరావు చిరస్మరణీయుడని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నరసరావుపేట మండలం రావిపాడులో మంగళవారం నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసన సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర ఐటీ టెక్నలాజికల్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జవహర్, రాష్ట్ర డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం తదితరులు పాల్గొని, డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు చేసిన అభివృద్ధి, టీడీపీలో ఆయన చేసిన సేవలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం డాక్టర్ కోడెల శివప్రసాదరావును మానసికంగా వేధించి ఆయన మృతికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం లో మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతుల చైర్మన్ పూదోట సునీల్‌కుమార్, కొల్లి బ్రాహ్మయ్య, బండారుపల్లి విశ్వేశ్వరరావు, కన్నెదార రాజు, పౌలురాజు, మెడబలిమి రాజేష్, పూదోట రాజు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుడిగా కంటే రూపాయికే వైద్యం అందించిన గొప్ప డాక్టర్‌గా కోడెల శివప్రసాద్ కీర్తి పొందారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. నరసరావుపేట రోడ్డులోని ఎన్‌ఎస్‌పీ కాలనీ సమీపంలో మాజీ శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు కాంస్య విగ్రహావిష్కరణ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ లావు మాట్లాడుతూ కోడెల శివప్రసాద్ డాక్టర్ వృత్తిని వదిలి రాజకీయ రంగప్రవేశంతో టీడీపీ కోసం పోరాటం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హైవేలతో పాటు వరికపూడిశెల, జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 17 మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్మించనున్నారన్నారు. పల్నాడు పులిగా కోడెల శివప్రసాద్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యేగా మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. వైసీపీ తప్పుడు కేసులు, వేధింపులకు ఆయన బలవన్మరణం పొందారన్నారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ కోడెల ప్రాణాన్ని వైసీపీ బలితీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరామ్ మాట్లాడుతూ పదవి అంటే పెత్తనం చేయడం కాదు పదవి అంటే పేదలకు అండగా ఉండటం అని నేర్పిన వ్యక్తి కోడెల అని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసాన్‌బాషా, జడ్పీటీసీ పారా హైమావతి, డాక్టర్ గోగినేని సాంబశివరావు, లగడపాటి వెంకట్రావు, వాసుదేవరెడ్డి, దాసరి కోటేశ్వరరావు, జగ్గారావులతో పాటు టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వినుకొండలో జరిగిన విగ్రహవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరో వర్ధంతి మంగళవారం నిర్వహించారు. పట్టణంలో నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రతిమలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అదే విధంగా నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న కోడెల విగ్రహానికి, 60 అడుగుల రోడ్డులో ఉన్న విగ్రహానికి, రావిపాడు రోడ్డులోని కమ్మ బాలుర వసతి గృహంలోని విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెంట మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, మాతంగి బంగారం, పల్లెల నాగిరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, మడకా శివప్రసాదు, కడియాల రమేష్‌బాబు, కడియాల తాండవకృష్ణ, మిరియాల వెంకట సుబ్బమ్మ, హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

● పల్నాడు అభివృద్ధి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు పూదోట సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, డీసీ చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, వడ్లమూడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్‌జీవో కాలనీలోని టీడీపీ కార్యాలయంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి అభిమానులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతిని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా నాయకులు గ్రామ కూడలిలోని కోడెల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సాదినేని సుధీర్, నాయకులు తోకల వీరరాఘవయ్య, కట్టా శ్రీహరి, మురుకుట్ల శ్రీధర్‌కుమార్, టి.రాజేష్, తోకల సాంబశివరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని అన్నవరం, తురుమెళ్ళ, అచ్చయ్యపాలెం, గోగులపాడు గ్రామాల్లో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ విగ్రహాలకు అభిమానులు ఘనంగా నివాళులర్పించి, అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



నరసరావుపేట 60 అడుగుల రోడ్డులో, ప్రభుత్వ ఆసుపత్రిలో కోడెల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, కడియాల రమేష్, లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

రొంపిచర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల గ్రామంలో రెవెన్యూ శాఖ ద్వారా వచ్చిన రేషన్ కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సరికొత్త మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● కారుమంచి (శావల్యాపురం): మండలంలోని కారుమంచి గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయకులతో కలసి తహసీల్దార్ అర్జున్‌నాయక్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్‌లు గడిపూడి విశ్వనాథం, గోపాళం శివప్రసాద్, డీసీ చైర్మన్ మందలపు వెంకట నారాయణ, టీడీపీనాయకులు గోరింట్ల హనుమంత రావు, డీటీ సుబ్బారావు, ఆర్‌ఐ చంద్రబాబు, వీఆర్వో దేవమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: వెల్లటూరు సచివాలయంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వక్కలగడ్డ తిరుపతిరావు, బొల్లాపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ దాసరి కోటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, వక్కలగడ్డ బాబూరావు, అర్లపూడి వెంకట నారాయణ, బొట్లగుంట నాగేశ్వరరావు, పల్నాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సల్మాన్, ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు తదితరులు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. సాతులూరులో మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అమీన్‌సాహెబ్‌పాలెంలో సర్పంచ్ కామినేని లలిత నాగేశ్వరరావు, గుర్రం నాగ పూర్ణచంద్రరావు తదితరులు పంపిణీ చేశారు.

● యడ్లపాడు: యడ్లపాడులో జరిగిన స్మార్ట్ కార్డుల పంపిణీ పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, గ్రామ సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. లింగారావుపాలెంలో గ్రామ టీడీపీ నాయకులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నూజెండ్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం నూజెండ్లలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, కూటమి నాయకులు లగడపాటి సూరిబాబు, బేతపూడి చిరంజీవి, కంచుమాటి తిరుపాలు, అరిగల కుమార్, పీ రజబాబు, తహసీల్దార్ జీ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: స్థానిక 10వ వార్డులో క్యూఆర్ కోడ్ తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీలు పాల్గొని ఇంటింటి తిరిగి కార్డులను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, టీడీపీ నాయకులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, షేక్ కరిముల్లా, కమల్ బాషా, అబ్దుల్ రౌఫ్, షేక్ అజహరుద్దీన్, షేక్ దరియావలి పాల్గొన్నారు. 18వ వార్డులో పార్టీ అధ్యక్షుడు ఆరెకట్ల కోటేశ్వరరావు, కో క్లస్టర్ సయ్యద్ వహాబ్, పార్టీ నాయకులు మేకనబోయిన సాంబశివరావు, షేక్ మౌలాలి, మల్నేని రమేష్, కొండా శ్రీను, మలకయ్య, వేల్పూరి చిరంజీవి, గంత నాగు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు.



విపర్లలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు

చిన్నకంచెర్ల (శావల్యాపురం) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు అన్నారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ కాల్స్‌లో మండలంలోని చిన్నకంచెర్ల గ్రామపంచాయతీలో కేవలం 41శాతం మాత్రమే నమోదు కావడంతో గ్రామాన్ని డీఎల్‌పీవో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడం, రోడ్లపక్కన చెత్త పడేసి ఉండడం, చెత్తసేకరణ కూడా సక్రమంగా జరగకపోవడం, తాగునీటి పథకం ట్యాంక్ వద్దకు వెళ్లే దారిలో పిచ్చిచెట్లు పెరిగి ఉండడాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చెత్తసేకరణ కేంద్రం వద్ద ఘనవ్యర్థాల నిర్వహణ, కంపోస్ట్ ఎరువుల తయారీ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. దీనిపై నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీవల్లి, యాకోబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిన్నకంచెర్లలో చెత్తసేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

పీఎన్‌సీ అండ్ కేఆర్ నర్సింగ్ విద్యార్థుల రక్తదానం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ నర్సింగ్ విద్యార్థులు మంగళవారం రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సింగ్ ప్రిన్సిపాల్ డీ గోపీనాథ్ జన్మదినం సందర్భంగా 20మంది నర్సింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. తల్లులు, గర్భిణులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పీ శ్రీనివాసప్రసాదు, వైస్ ప్రిన్సిపాల్ బీ సుజి కల్పనా, సాయినాథ్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న పీఎన్‌సీ, కేఆర్ నర్సింగ్ విద్యార్థులు

భూమి ఆరోగ్యంతోనే మనిషి మనుగడ: డీపీఎం అమలకుమారి

యడ్లపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూమి ఆరోగ్యాన్ని కాపాడితేనే మనిషి ఆరోగ్యంగా మనగలుగుతాడని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా పత్తి పొలాలను సందర్శించి పరిశీలించారు. చీడపీడలు, సస్యరక్షణ గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసాద్, గ్రామసర్పంచ్ మానం సాంబయ్య, అభ్యుదయ రైతులు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్లపై దాడులను అరికట్టాలి

● డాక్టర్ గొల్లపూడి రాజాసుందరం బాబు



చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

వినుకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డాక్టర్ గొల్లపూడి రాజాసుందరం బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వెల్లటూరు రోడ్డులోని జీపీఎస్ ప్రార్థనామందిరం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు క్రైస్తవులు, విశ్వాసులు మధ్యాహ్నం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజాసుందరంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పాస్టర్లు చర్చిల్లో శాంతియుత దైవబోధనలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చిలపై జరుగుతున్న దాడులను ఖండించాలని, మతమార్పిడి పేరుతో అక్రమంగా అరెస్టు చేసిన పాస్టర్లను వెంటనే విడుదల చేయాలని మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజాసుందరంబాబు మాట్లాడుతూ భారతరాజ్యాంగం మత స్వేచ్ఛ గురించి మాట్లాడుతుంటే దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో మత స్వేచ్ఛ లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా అక్రమంగా మతమార్పిడి వ్యతిరేక చట్టాలను రూపొందించి వేలాదిమంది పాస్టర్లను, క్రైస్తవులను జైలు పాలు చేసి హింసించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ నాయకులు కొత్త డేవిడ్, ప్రభుదాసు, కామరాజు, సోమవరపు రవికుమార్, సుబ్బారావు, నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఎస్సీలే వైసీపీకి మూల స్తంభాలు

● వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఎస్సీలే మూల స్తంభాలని పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక కాసు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీలో ఎస్సీలకు ప్రథమ స్థానం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వేధింపులను ఎవరైతే తట్టుకొని నిలబడగలుగుతారో వారికే పార్టీలో అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ గౌతంరెడ్డి, మాజీ మంత్రి విడదల రజని, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, సత్తెనపల్లి పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

వినుకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలోని శ్రీబాలాజీ ఐటీఐ కాలేజీలో మేరా యువ భారత్ (నెహ్రూ యువ కేంద్రం) గుంటూరు వారి సహకారంతో నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ సెక్రటరీ యన్.భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో 'హిందీ దివస్/పక్వాడా 2025' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ పాల్గొన్నారు. బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్‌లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పొట్లూరి దుర్గాప్రసాద్, నూజండ్ల వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు

వినుకొండ టౌన్ సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అక్కినేని కళాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్షికోత్సవాల్లో వినుకొండకు చెందిన యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌కు జాతీయ సేవ రత్న అవార్డు అందచేశారు. అదేవిధంగా వినుకొండ పట్టణానికి చెందిన జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్‌కు అంబేడ్కర్ జాతీయస్థాయి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు, విద్యావంతులు, కళాకారులు, సాహితీవేత్తలు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

యడ్లపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ సీఆర్‌డీపీ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు ఎం.శ్రీనివాసరావు నేతృత్వంలోని విద్యుత్, విజిలెన్స్ అధికారుల బృందం మండలంలోని 18 గ్రామాల్లో తనిఖీలు నిర్వహించింది. మొత్తం 40 బృందాలు యడ్లపాడు సెక్షన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యం, అధికలోడు, అనధికారికంగా విద్యుత్ వినియోగం చేస్తున్న సర్వీసులను గుర్తించి కేసులు నమోదు చేశారు. తనిఖీల అనంతరం అధికారులు మాట్లాడుతూ అనధికారికంగా అధిక లోడు వినియోగిస్తున్న 34 సర్వీసులను గుర్తించి రూ.1,74,600లు, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న 9 సర్వీస్‌లకు రూ.1,74లక్షలు అపరాధ రుసుం విధించడం జరిగిందన్నారు. అంతేగాకుండా విద్యుత్ కనెక్షన్ తీసుకోకుండా తీగల మీద నుంచి నేరుగా విద్యుత్ వాడుకుంటున్న 7 సర్వీసులకు రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

డీఏలను విడుదల చేయాలి: ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు బకాయిలు ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరేకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బీ శ్రీనివాసరావు, బిక్కి ప్రజామూర్తి, జిల్లా కార్యదర్శి ఇబ్రహీమ్, కరీముల్లా, శివానంద్ కుమార్, రాజా, నరసరావుపేటశాఖ అధ్యక్షుడు జాన్‌సాహెబ్, ఆంజనేయులు, అమరనాథ్, సాంబశివరావు, ఐతంరాజు, జిలానీ, హనుమంతురావు, గురులింగం పాల్గొన్నారు.